క్లుప్తంగా

ఎలక్ట్రీషియన్‌డే ప్రకటించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

కదిరి టౌన్: జనవరి 27వ తేదీని ఎలక్ట్రీషియన్ డేగా ప్రకటించాలని ఖాద్రీ డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. డివిజన్ నాయకులు మాట్లాడుతూ జనవరి 27ను ఎలక్ట్రీషన్‌డేగా ప్రకటించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు, పనిముట్లు ఇవ్వాలని, మండలానికి ఒక సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ తిరుపాల్, రఫిక్, బ్రహ్మకుమార్, సురేష్, మదార్‌వలి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బత్తలపల్లి: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైతసిద్ధాంత గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఆచారి ఆధ్వర్యంలో సోమవారం బత్తలపల్లి మండలం పోట్లమర్రి, మాల్యవంతం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కర్ సాధు, శివమ్మ, ఈశ్వరమ్మ, కృష్ణవేణి, సునీత, శారద, గంగాదేవి, చౌడేశ్వరి, త్రైతేశ్వరి, చంద్రశేఖర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కో కన్వీనర్‌గా గోపీచంద్

పుట్టపర్తి అర్బన్: ఏబీవీపీ రాష్ట్ర ఐఎన్‌డీ జీనియస్ కోకన్వీనర్‌గా గోపీచంద్ నరసింహను ఎంపిక చేసినట్లు రాష్ట్ర కమిటీ అధికారికంగా ప్రకటించింది. ఇటీవల విశాఖలోని ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండులో జరిగిన ఏబీవీపీ మహాసభల్లో గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ విద్యార్థి గోపీచంద్‌ను కో కన్వీనర్‌గా ఎంపిక చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. రిపబ్లిక్ డే సందర్భంగా భోజనం అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. బాధ్యతారహిత్యంగా పని చేసిన వార్డెన్ నారాయణ స్వామిపై అసహనం వ్యక్తం చేశారు. తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, స్నానాల గదులు సక్రమంగా పని చేయక పోవడంతో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏబీసీడబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ వార్డన్ నరసింహమూర్తి, బాలికల వసతి గృహం అధికారి శ్యామల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: మండల పరిధిలోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లికి చెందిన బాబ్జీ అనంతపురంలోని ఓ కంప్యూటర్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని బత్తలపల్లికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. లింగారెడ్డిపల్లి బస్‌స్టాప్ సమీపంలోకి రాగానే ధర్మవరం మండలం రావులచెరువు గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనంతపురం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

బొలెరో ఢీకొన్ని మరొకరికి గాయాలు

వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కొత్తపల్లికి చెందిన ఓబులేసు కుమారుడు అరిగల రాంబాబు సోమవారం ధర్మవరానికి వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చాడు. సాయంత్రం తిరిగి బైక్‌పై బయల్దేరాడు. బత్తలపల్లి వద్ద బొలెరో వాహనం ఉన్నట్టుండి ఆటోగ్యారేజీలోకి తిప్పడంతో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు.

అనాథలకు అన్నదానం



వృద్ధులకు అన్నం ప్యాకెట్లు అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు ప్రైవేట్ విద్యుత్ కార్మికులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాముడు, కొండప్ప, రవి, రాజా, పెద్దన్న, యల్లప్ప, నాగరాజు, రామాంజి, మస్తాన్, పోతులయ్య, బాలయ్య పాల్గొన్నారు.



చీకిరేవులపల్లి వద్ద సాగు చేసిన వరి

పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు సాగైన వరి

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
బుక్కపట్నం	1,200
కొత్తచెరువు	1,000
పుట్టపర్తి	450
అమడగూరు	350
నల్లమాడ	200
ఓడిచెరువు	200
మొత్తం	3,400

రైతుల ఆశలు వరించేనా?

- పుట్టపర్తి నియోజకవర్గంలో భారీగా వరి సాగు
- రెట్టింపు కూలితో పెరిగిన పంట పెట్టుబడులు
- ఫిబ్రవరి ఐదో తేదీ వరకు సాగుకు అనుకూలం

అమడగూరు: రబీ–2025లో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గత ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. భూగర్భజలాలు పెరిగాయి. బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తుండడంతో చాలామంది రైతులు వరి సాగువైపు మొగ్గు చూపుతున్నారు. పలువురు రైతులు కౌలుకు తీసుకుని మరీ ఈసారి వరి పంట పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. డిసెంబర్ నుంచే సాగు మొదలైంది. ఫిబ్రవరి ఐదో తేదీ వరకు వరి నాట్లు వేసుకునేందుకు సమయం ఉంది. ఇప్పటికే పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 3,400 ఎకరాల్లో వరి వేశారు. 4వేల ఎకరాలు దాటవచ్చని భావిస్తున్నారు. గత ఏడాది రబీలో దాదాపు 1500 ఎకరాల్లో వరి సాగవగా.. ఈ ఏడాది భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కూలీలకు డిమాండ్

వరి సాగు విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. అదనులో నాటితే మంచి దిగుబడి వస్తుందని రైతులంతా ఏక కాలంలో వరి నాట్లకు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో కూలీలు దొరొకడం కష్టంగా మారింది. దీంతో నాట్లు సిద్ధం చేసుకున్న రైతులు రెట్టింపు కూలి ఇచ్చి కూలీలను పిలిపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పురుషులకు రూ.600, మహిళలకు రూ.500 చెల్లించడంతో పాటు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. కూలీలు చిక్కని ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల కూలీలకు ఆటోలను ఏర్పాటు చేసి తీసుకెళ్తున్నారు. ఆటో ఖర్చులు సైతం రైతులే భరిస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి వ్యయం

కూలీల డిమాండ్ నేపథ్యంలో వరి సాగు వ్యయం భారీగా పెరిగింది. దున్నేందుకు ట్రాక్టరుకు గంటకు రూ.1,500 తీసుకుంటున్నారు. ఎకరాకు 8 గంటల సమయం పడుతోంది. ఎకరం నాటడానికి 20 మంది కూలీలు అవసరం. నాటిన తర్వాత డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ మందుల పిచికారీకి రూ.10 వేలు వెచ్చించాలి. కోత దశలో ఎకరం పొలం కోయడానికి గంటకు రూ.4 వేల చొప్పున 4 గంటలకు రూ.16వేలు ఖర్చు చేయాలి. ఈ లెక్కన రూ.40 వేలకు పైగానే పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఖర్చులు పెరిగాయ్



ఈసారి వరి పంట పెట్టుబడులు పెరిగాయి. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ఈసారి కూలీలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎకరం విస్తీర్ణంలో వరి సాగు చేసి రెండు వారాలు దాటింది. ఇప్పటికే రూ.20 వేలు ఖర్చయ్యింది. పంట పూర్తయ్యేసరికి ఇంకెంత కావాలో? పెట్టుబడులు, రైతుల శ్రమను బేరీజు వేసి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే బాగుంటుంది.

– రామిరెడ్డి, చీకిరేవులపల్లి, అమడగూరు మండలం

లాభాలు వరిస్తే మనుగడ..



నీరు సమృద్ధిగా ఉండటతో ఖర్చులు ఎక్కువైనా చాలా మంది రైతులు వరి సాగు చేశారు. నేను కూడా బుక్కపట్నం కింద మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. ఖర్చు రూ.లక్షకు పైగా అయ్యింది. ఆశించిన స్థాయిలో పంట పండి, గిట్టుబాటు ధర లభిస్తే రైతు లాభాల్లోకి వస్తాడు. లేదంటే నష్టాలు మూటగట్టుకోవాల్సిందే.

– నాగరాజు, రైతు, బుక్కపట్నం

5 వరకు సాగుకు చాన్స్



వచ్చే నెల ఐదో తేదీ వరకు వరి సాగు చేసుకోవచ్చు. ఆ తర్వాత సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండదు. ముఖ్యంగా రైతులు ప్రారంభం నుంచే వ్యవసాయ సిబ్బంది సలహాలను పాటిస్తూ సాగు చేస్తే తక్కువ ఖర్చులతో మంచి దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. పంట మధ్యకాలంలో కూడా వ్యవసాయాధికారులకు పంటను చూపిస్తుండాలి.

– సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో గల వ్యవసాయ గోదాములో మార్క్‌ఫెడ్ వారు ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వ్యవసాయాధికారులు, మార్క్‌ఫెడ్ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందులు క్వింటాలు రూ.7,550 ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కంది రైతులు రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, మార్క్‌ఫెడ్ సిబ్బంది, మండల రైతులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలు వ్యక్తిత్వ వికాస నేస్తాలు



ఎస్పీకి సామాజిక సాహిత్య పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: మంచి పుస్తకాలు మనిషి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే గొప్ప నేస్తాలని ఎస్పీ రత్న పేర్కొన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధానకార్యదర్శి బాబు, ఉపాధ్యక్షులు జయానందరెడ్డి, కవి, సీనియర్ జర్నలిస్ట్ ఉద్దడం చంద్రశేఖర్ ఎస్పీని మర్యాద పూర్వకంగా కలసి సామాజిక సాహిత్య పుస్తకాలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ రంగాల సమాచారాన్ని క్రోడీకరించి పుస్తకాలు వెలువరించడం అభినందనీయమన్నారు.

పింఛన్ల పునఃపరిశీలన

తాడిమర్రి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ వెంకట రంగారావు సూచించారు. ఏకపాదంపల్లిలో సోమవారం వైద్యాధికారులతో కలసి ఆయన పింఛన్ల పునఃపరిశీలనను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ చైతన్య, డాక్టర్ హరిత, డాక్టర్ గోవర్ధన్ నాయుడు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెల, న్యామద్దెల, చెన్నేకొత్తపల్లి, నాగసముద్రం, పులేటిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం వైద్యాధికారులు సామాజిక పింఛన్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాఘవేంద్రరాజు, డాక్టర్ ఇమ్రాన్‌బాషా ఖాద్రి, వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు అందుకున్న వారిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



సీఎంఆర్‌టీలను సన్మానిస్తున్న ఎంఈఓలు ఇతర సిబ్బంది

బత్తలపల్లి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న అధికారులు, ఉద్యోగులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, బత్తలపల్లి పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, బత్తలపల్లి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, డి.చెర్లోపల్లి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రాజారెడ్డి, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ వీరాంజనేయులు, మాల్యవంతం సచివాలయ సెరికల్చర్ అసిస్టెంట్ లావణ్యలత, ఎంపీడీఓ కార్యాలయ సబార్డినేట్ సుశీలమ్మ ఉత్తమ అవార్డులు అందుకున్నారు. వీరికి ఎంపీడీఓ నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ తదితరులు ఘనంగా సత్కరించారు.

చెన్నేకొత్తపల్లి: శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఉత్తమ సీఎంఆర్‌టీలుగా ప్రశంసా పత్రాలు అందుకున్న పుష్పలత, నరసింహులు, మెసెంజర్ సోమశేఖర్‌ను సోమవారం సన్మానించారు. ఎమ్మార్సీలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మున్వర్‌బాషా, ప్రసూన్‌కుమార్ నాయుడు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



అన్నదానం చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ కొండారెడ్డి, సంస్థ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సోమవారం పరమసంస్థానం పరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా ట్రాన్స్‌కో ఏఈ కొండారెడ్డి చేతులమీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

ధర్మవరం రూరల్: వసంతపురంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. దూడలు, పశువులలో నట్టల నివారణ, గొర్రెలు, మేకలలో డీవార్మింగ్‌తో పాటు పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో పశువర్ధక శాఖ ఉప సంచాలకు డాక్టర్ చంద్రశేఖర్, పశువైద్యాధికారి డాక్టర్ శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సచివాలయం ఏర్పాటు చేయండి

పుట్టపర్తి: నార్శింపల్లి తండాలో సచివాలయం ఏర్పాటు చేయాలని తండా వాసులు కోరారు. ఈ మేరకు ఎస్‌పీటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు సుధాకర్‌నాయక్ ఆధ్వర్యంలో తండావాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ చేతన్‌ను కలిసి అర్జీ అందజేశారు. గెజిట్‌లో నార్శింపల్లి తండా పేరును పొందుపరచాలని కోరారు. తండాలో టవర్ లేక సెల్‌ఫోన్లు కూడా పనిచేయడం లేదని, ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తండావాసులు తెలిపారు.

రోడ్డు విస్తరణకు సహకరిస్తాం

తనకల్లు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనులు చేపడితే పూర్తిగా సహకరిస్తామని స్థానిక వ్యాపారులు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తామంతా జాతీయ రహదారి పక్కన ఇళ్లు, దుకాణాలను ఏర్పాటు చేసుకొని వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటున్నామన్నారు. భవిష్యత్‌లో విస్తరణ పనులు చేపట్టినప్పుడు తమ దుకాణాలు ఉన్న స్థలాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారులు సురేష్ రామాంజినేయులు, సత్యనారాయణ, గోపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బుక్కపట్నంలో జాబ్ మేళా

పుట్టపర్తి: బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

3న వేలం పాట

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయ పరిసరాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు ఏడాది పాటు హక్కుల కోసం ఫిబ్రవరి మూడో తేదీ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ రవీంద్రరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.50 వేల డిపాజిట్ ముందుగానే చెల్లించాలని పేర్కొన్నారు. టెంకాయలు, పూజా సామగ్రి, విడి పూలు, హారాలు, బొమ్మలు, దారాలు, కూల్‌డ్రింక్స్, చిల్లర అంగడి, ఐస్‌క్రీం, గాజుల విక్రయం తదితర వ్యాపారాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు వివరించారు.

బాధ్యతల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల వసతి గృహం అధికారిగా నరసింహమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న నారాయణ స్వామి సస్పెండ్ అయ్యారు. రామగిరిలోని బీసీ బాలుర కాలేజీ వసతి గృహం అధికారి నరసింహమూర్తికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చెన్నకృష్ణ తెలిపారు. 11కేవీ కుటాగుళ్ల, 11కేవీ చిప్పలమడుగు, 11కేవీ సైదాపురం, 11కేవీ కోటన్నగారిపల్లి, 11కేవీ చలమకుంట్లపల్లి ఫీడర్, విద్యుత్ సబ్ స్టేషన్లో కొత్త లైన్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

చెన్నేకొత్తపలి: రామగిరి విద్యుత్ కేంద్రంలో వివిధ పనుల నేపథ్యంలో ఈనెల 30, 31 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ఏడీ లక్ష్మీనారాయణ, ఏఈఈ రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉలవ కట్టెకు నిప్పు

నల్లమాడ: నల్లసింగయ్యగారిపల్లి వద్ద రిటైర్డ్ ఉపాధ్యాయుడు కనుముక్కల లక్ష్మన్నకు చెందిన మామిడి తోటలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ఉలవ కట్టెకు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో కోసి కుప్పగా వేసిన రెండు ట్రాక్టర్ల ఉలవతో పాటు లాడర్ పైపులు, విద్యుత్ ఫ్యూజులు, రెండు ప్లాస్టిక్ కవరు పట్టలు కాలిబూడిదైనట్లు బాధిత రైతు తెలిపాడు. పదేళ్ల వయస్సున్న ఆరు మామిడి మొక్కల కొమ్మలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నాడు. దాదాపు రూ.30వేల నష్టం వాటిల్లిందని తెలిపాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాఠశాల డైరెక్టర్లు



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

ధర్మవరం: పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో సోమవారం 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, డైరెక్టర్ రవీంద్ర, పృథ్వీరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. గత ఏడాది పదో తరగతిలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ రవీంద్ర, పృథ్వీరాజ్‌లు ముఖ్య అతిథుల చేతులమీదుగా జ్ఞాపికతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యశోద పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.